508029001

ప్రేమ స్వరూపులారా!

అష్టైశ్వర్య స్వరూపుడైన భగవంతుడు అష్టరూపములతో ఈ సృష్టిని ఆవరించి ఉన్నాడు. ఈ చరాచర ప్రపంచమంతటిని విశ్వము అని పిలుస్తూ వచ్చారు. విశ్వమనగా అనేక అంగములతో ప్రవేశించిన పరమాత్ముడే. 'విశ్వం విష్ణు స్వరూపం'. విష్ణువు అనగా విశేషంగా వ్యాపించే గుణము కలవాడు. విశ్వము కార్యము. విష్ణువు కారణం. కార్యకారణ స్వరూపమే ఈ జగత్తు. కనుక కార్యకారణ స్వరూపమైన భగవత్ తత్త్వం విశ్వస్వరూపంలోనే దర్శించుటకు వీలవుతుంది.

ఈ విశ్వమందు భగవంతుని మొదటి స్వరూపము జలము. ఈ జలము లేకుండా మానవుడు జీవించ జాలడు. జలము సర్వత్రా వుంటున్నది గాని కొన్ని కొన్ని ప్రదేశములలో బాహ్యముగా కనిపించవచ్చు; మరి కొన్ని ప్రదేశములలో అట్టడుగున నిల్చి వుండవచ్చును. ఈ జలమునకు మరొక పేరు జీవనము. జలస్వరూపుడైన భగవంతుడు ఈ జగత్తునందు మొదటి స్వరూపము ధరించి మనలను సంరక్షిస్తున్నాడు.

రెండవది అగ్ని. అగ్ని చేతనే సమస్తము వికసిస్తూ, ప్రకటిస్తూ ప్రదర్శిస్తూ వస్తున్నది. ఈ అగ్నియే మానవుని యందు జఠరాగ్నిగా నిరూపిస్తూ వచ్చింది. మానవుడు భుజించిన ఆహారము జీర్ణముగా మార్చి తదుపరి రక్తము, మాంసము, కండలు, ఎముకలు ఇలాంటి సప్తస్థితులుగా మార్చి దేహమును పోషిస్తూ వచ్చినది. దీనినే సప్త ధాతువులు అని నిరూపిస్తూ వచ్చింది. ఈ సప్త ధాతువులే లేకున్న జీవితము క్షణకాలము నిలువ జాలదు.

మూడవది భూమి. ఈ భూమిపైననే సర్వప్రాణులు జీవిస్తూ వున్నాయి. జనన మరణాదులన్నీ ఈ భూమి యందే సంభవిస్తున్నాయి. సృష్టిస్థితిలయ కారణము లైన ఈ భూమిని భగవత్ తత్త్వముగా నిరూపిస్తూ వచ్చింది. మానవునికి అవసరమైన ఆహార పదార్థములన్నియు భూమిద్వారానే లభ్యమవుతున్నవి. భగవంతుడు భూస్వరూపుడు. భగవంతునికి భూమానందుడని పేరు. మనము భగవంతుని ఒక స్వరూప స్వభావముతో దర్శించటానికి సాధ్యము కాని స్థితిలో ఈ విధమైన గుణస్వభావములను దర్శించటము అత్యవసరము.

నాల్గవది గాలి. మనము క్షణక్షణము పీల్చుకుంటూ వదలుకుంటూ వుంటున్నాము. ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసము లన్నియు గాలిమయమే. మనము తీసుకొనే గాలి 'సో' అని తీసుకుంటాము. వదలేటప్పుడు 'హం' అని వదులుతాము. సోహం అంటే 'నేనే దైవము' అని స్ఫురింపచేస్తుంది.

ఒక చక్కని ఉదాహరణము భాగవతమునందున్నది. పోతన చెప్పాడు 'పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుండట'. 'వాడు' అనే పదము నుపయోగించాడు. 'నే పలికిన భవహరమగునట'. ఇక్కడ 'నే' అనే పదమునుపయోగించాడు. 'వాడు', 'నే' అని రెండు పదములు చేర్చాడు. 'వాడు' అను పదమునకు 'సః' అనియు 'నేను' అను పదమునకు 'అహం' అనియు రెండూ కలిపితే 'సోహం' అవుతుంది. 'సోహం' అనే అర్థమును స్ఫురింపచేసేటట్లు పోతన భాగవతమును రచించాడు. ఈ ఉచ్ఛ్వాస నిశ్వాస గాలి స్వరూపుడే భగవంతుడు.

భగవంతుడు మనయందే, మన ముందే పంచభూత స్వరూపుడై ప్రకాశిస్తుండగా మనము ఎక్కడో భగవంతుని వెతకటానికి ప్రయత్నిస్తూ వున్నాము. నిజంగా భక్తులు భగవంతుని వెతుకుతున్నారా లేక భగవంతుడే భక్తులను వెతుకుతున్నాడా? అది చక్కగా విచారించాలి. నా దృష్టిలో భగవంతుడే నిజమైన భక్తుడెక్కడని వెతుకుతూ వున్నాడు. కనుక మనము భగవంతుని వెతకనక్కరలేదు. 'పశ్యన్నపి చ న పశ్యతి మూఢః'. భగవంతుని ప్రత్యక్ష విశ్వస్వరూపునిగా దర్శిస్తూ 'భగవంతుడు కనుపించడు, కనుపించలేదే' అని అనుకుంటున్నాడు మూఢుడు.

ఐదవది ఆకాశము. ఆకాశము సర్వులకు అవకాశము నందించేటువంటిది. ఆకాశము యొక్క గుణము శబ్దము. లేనందు జగత్తులో ఏమాత్రము కనుపించదు, వినుపించదు. సమస్తము శబ్ద స్వరూపమైనది. సృష్టి అంతయు శబ్దము ద్వారా యేర్పడినదే. ఇట్టి శబ్దమే మానవుని యందు సోహం శబ్దముతో 'హం సోహం' అనే భావంతో ఉచ్ఛరిస్తుంటుంది. ఈ ఆకాశము ఎక్కడ వున్నది? ఆకాశము ఎక్కడో పైన ఉన్నదని భావిస్తున్నాము. పైనున్నవి మేఘములు మాత్రమే. ఎక్కడ శబ్దమున్నదో అక్కడంతా ఆకాశము వున్నది. నేను మాట్లాడుతున్నాను. ఇదియూ ఆకాశమే. ఈ టేబుల్ మీద కొడితే అదియూ ఆకాశమే. భజన చేసే అప్పుడు వేసే తాళము కూడా ఆకాశమే. ఉచ్ఛ్వాస నిశ్వాసములంతా ఆకాశమే. ఇట్టి ఆకాశమైన అవకాశమునందే మనము జీవితము గడుపుతున్నాము.

ఆరవది సూర్యుడు. సూర్యుని వల్లనే సమస్త జీవులు జీవించగలుగుచున్నవి. సూర్యుని నుండి వెలువడు శక్తి వల్లనే సమస్త జీవులు, జంతువులు, వృక్షములు, పంటలు అభివృద్ధి అవుతూ వున్నాయి. సూర్యుడు లేక జగత్తే లేదు. అతని యొక్క ప్రతిబింబ స్వరూపమే మానవుని యందు బుద్ధి ఆకారమును దాల్చినది. సూర్యుని యొక్క దీని వల్లనే బుద్ధి యొక్క విచారణా శక్తి పెంపొందింపబడుతూ ది. మేధాశక్తియు అభివృద్ధిగా విస్తోంది. విచారణా శక్తియే లేకున్న మానవుడు వికార స్వరూపాన్ని ధరిస్తాడు.

ఏడవది చంద్రుడు. చంద్రుని యొక్క తత్త్వము మానవుని శాంత పరుస్తుంది. దీని

యొక్క ప్రతిబింబమే మనస్సు. మనస్సు యొక్క ప్రశాంతియే మానవుని యొక్క ప్రధాన లక్ష్యము. సూర్యుని నుండి భూమి వచ్చింది. భూమి నుండి చంద్రుడు ఉద్భవించాడు. కనుక సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే పదార్థము యొక్క విభాగములే. ఈ మూడింటిలో ఎట్టి భేదము లేదు. ఈ మూడూ మానవుని ఆకారము నందు మనో, బుద్ధి, విజ్ఞానమైన స్వరూపాలను ధరిస్తాయి.

ఎనిమిదవది వేదప్రమాణము. అదియే నిజమైన సత్యము. 'సత్యాన్నాస్తి పరో ధర్మః' ఈ సత్యస్వరూపుడైన భగవంతుడు నిత్యుడై, నిరాకారుడై, జగత్తునందు ఆకారముతో ఆవిర్భవిస్తూ వుంటాడు. భగవంతుని అష్టవిధస్వరూపముగా నిరూపించుకొని అతన్ని దర్శించుటానికి ప్రయత్నించినప్పుడు మనకు ఎట్టి బాధలు కలుగవు.

ఆత్మకు మూడు రకములైన అంగములుంటున్నాయి. మొదటిది మనస్సు. రెండవది బుద్ధి మూడవది సంస్కారము. ఈ మూడింటి యొక్క ఏకస్వరూపమే ఆత్మ. ఆత్మ అనగా ఒక ప్రత్యేక ఆకారమును ధరించినది కాదు. మనో బుద్ధి సంస్కార సమ్మిళిత స్వరూపమే ఆత్మ. ఎవరినైనా మనము 'మనస్సంటే ఏమిటి?' అని ప్రశ్నించినప్పుడు 'It does not matter' అని అంటారు. 'దానిని విచారించవలసిన అవసరము లేదంటారు' what is matter అని అడిగితే 'దానిని ఏమీ చింతించనక్కర లేదంటాడు'. ఇక దేనిని విచారించేది జగత్తులో? మనస్సంటే, matter అంటే అర్థము కాని వ్యక్తి ఇక దేనిని విచారించగలడు?

మానవ జీవితములో నిరంతరము మనస్సు పదార్థమును చింతిస్తూ వుంటుంది. ఇదే మనస్సు యొక్క కేంద్రము, ఇటువంటి ఆధారమైన ప్రధానమైన మనస్తత్త్వమును గుర్తించుకోలేకపోవటం చేతనే యిన్ని దుఃఖములకు గురైపోతున్నాము. మనస్సనేది సంకల్పముల చేరిక మాత్రమే కాదు. సంకల్ప వికల్పాత్మకమైన స్వరూపము. నిరంతరము మననము చేసే స్వభావమే. ఇట్టి ప్రధానమైన ప్రాథమికమైన మనస్ తత్వాన్ని గుర్తించుటకు ప్రయత్నించాలి. ఈ మనస్సు భౌతికము కాదు. ఇది శరీరము కాదు. ఆత్మ యొక్క విచారణా శక్తి గాలి కంటె, కాంతి కంటె అతి వేగముగా ప్రయాణమయ్యేది మనస్సు. ఇంత వేగంగా వెళ్ళే మనశ్శక్తిని మనయందుంచుకొని మనము కేవలము బలహీనులుగా భావిస్తున్నాము. ఇదియే ఒక దౌర్భాగ్యము. హృదయమునకు, మనస్సునకు సంబంధము లేదు. హృదయము దేహములో వుండే ఒక ప్రధాన భౌతిక వస్తువు. ఇది అన్ని అంగములకెల్ల రక్తము సరఫరా చేస్తూ వుంటుంది. హృదయము భౌతికమైనది. కాని మనస్సు భౌతికము కాదు. ఇది ఆత్మ యొక్క ప్రధాన శక్తి.

రెండవది బుద్ధి. ఇదే మేధాశక్తి అని మనము భావిస్తున్నాము. అది సరికాదు. ఇది ఆత్మ

యొక్క విచారణా శక్తి, బుద్ధికి చాలా వ్యత్యాసముంటున్నది. మేధాశక్తి దేహములో స్థూల స్వరూపమును పోలినటువంటిది. ఇది అన్ని నాడులకు ప్రధానమైన కేంద్రము. Control room వంటిది. కనుక హృదయమునకు బుద్ధికి సంబంధము చేయకూడదు. బుద్ధి భౌతికమైన దేహమునకు గాని, భౌతికమైన ప్రపంచమునకు కానీ సంబంధించినది కాదు. ఇది ఆత్మలో కూడినటువంటిది. నిత్యమై, సత్యమై నిరంజనమైన స్వరూపము.

మూడవది సంస్కారము. మానవునికి ప్రధానమైనది సంస్కారము అనగా యీనాడు లోకంలో ఎట్టిక్యూ అని అనుకుంటున్నాము. కాదు. అంత సులభమైనది కాదిది. నైతిక ప్రవర్తనలో కూడి ఆచార విచారములలో వుండి, సాంప్రదాయములతో గూడి చక్కని నడతలతో ఏర్పడినటువంటి స్వరూపము ఈ సంస్కారము. మానవుని యొక్క ప్రధానమైన నడత యిందులో నిరూపిస్తూ వస్తున్నది. నడత లేకున్న మన జీవితము యేమాత్రము రాణించదు. అట్టి నడత మనో బుద్ధులతో కూడి వుండాలి. విజ్ఞాన తత్త్వ విషయము పరిశీలనా శక్తి కూడా చేరి వుండాలి. ఆత్మ అనాత్మ విషయము గుర్తించి వుండాలి. ఈ విధమైన పవిత్ర జ్ఞానము, సత్త్వములో కూడిన మనోబుద్ధులతో చేరినప్పుడే యిది సంస్కారముగా రూపొందుతుంది. మనో, బుద్ధి, సంస్కార సమ్మిళిత స్వరూపమే ఆత్మ అని మనము విచారించాలి.

ఈనాడు మానవునికి అనేక రకములైన పరిణామములు జరుగుతూ వుంటున్నాయి. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిణామములు జరుగుతూ వున్నాయి. కాని మానసిక పరిణామము జరగుటము లేదు. ఎన్ని పరిణామములు జరిగినప్పటికిని మానసిక పరిణామము జరుగకున్న అన్నీ నిరర్థకములే. కనుకనే మానవుడు యీనాడు అనేక విచారములకు గురైపోతున్నాడు. "నా బాధలు తీరటం లేదే. నా కష్టాలు తీరటం లేదే, భగవంతునికి నాపై కృప రాలేదే' అని విచారిస్తున్నాము. దీనికి ఒక చక్కని ఉదాహరణము రామాయణము లో వుంది.

హనుమంతుడు విభీషణునితో స్నేహము చేసిన తరువాత ఏదో మాటల సందర్భములో విభీషణుడు హనుమంతునితో అన్నాడు. "హనుమాన్ నీవు వానరుడవైనను భగవదనుగ్రహమునకు పాత్రుడవైనావు. నేను నిరంతరము రామ చింతనతో గడిపినప్పటికిని నాకు రామ ప్రాప్తి ఎందుకు కలుగలేదు? రామానుగ్రహము కలగకుండుటకు ఏమి కారణము' అన్నాడు. హనుమంతుడు, "విభీషణా! నీవు నిరంతరము రామనామ స్మరణ చేస్తున్నావు. నిజమే. కాని రామకార్యములో నీవు ఎంత వరకు పాల్గొంటున్నావు? రామ నామ చింతన చేసినంత మాత్రమున రామానుగ్రహము నీకు లభ్యము కాదు. రామకార్యములో కూడా నీవు ప్రవేశించాలి. నీ సోదరుడైన రావణుడు నీ ఆరాధ్యదైవమైన రాముని పత్నిని అపహరించుకొని వచ్చినప్పుడు ఆమెకు నీవు ఏవిధమైన సహాయము చేశావు? ఆ

...ని విచారము కొంతవరకైనా తగ్గించేదానికి ఏదేమైనా ఇందులో పాల్గొన్నావా? రామరామ యని నామ స్మరణ చేసినంత మాత్రమున రామానుగ్రహము రాజాలదు. కృష్ణ కృష్ణ యని కృష్ణనామ స్మరణ చేసినంత మాత్రమున కృష్ణానుగ్రహము రాదు. బాబా బాబా యని బాబా నామ స్మరణ చేసినంత మాత్రమున బాబా అనుగ్రహము రాదు. బాబా ఆజ్ఞలు ఎంతవరకు పాటిస్తున్నారు.? రాముని యొక్క ఆశయాలు ఎంత వరకు మనము ఆచరణలో పెడుతున్నాము? కృష్ణుని యొక్క బోధలు భగవద్గీత మనం ఎంతవరకు పాటిస్తున్నాము? ఆచరణ లేక నామ స్మరణ చేసినంత మాత్రమున అది ఒక గ్రామఫోను లేక టేపురికార్డర్ అయిపోతుంది. హృదయంతో ఆనామస్మరణ చెయ్యాలి. ఆ హృదయంతో క్రియలు చెయ్యాలి. ప్లేటులో చపాతి వేసుకొని చపాతి చపాతి అని జపించిన పొట్ట నిండదు. చపాతి అని చెప్పక పోయినా పరవాలేదు గాని చేతితో తీసి నోట్లో వేసుకుంటే కడుపు నిండిపోతుంది. కనుక నిత్యాచరణ చాలా అవసరమైనది. ఆచరణ లేకపోతే ఇది ఏమాత్రము మనకు లక్ష్యము కాదు. ఈనాటి కలియుగ ప్రభావము వలన నామస్మరణ చేత మాత్రమే దీనిని సాధించుటకు ప్రయత్నిస్తున్నాము.

తమిళనాడులో తమిళవేదము చెప్పబడే తిరుక్కురళ్ అనే గ్రంథమును వ్రాసినవాడు తిరువళ్ళువర్. ఇతను దినము కొన్ని పద్ధతులను ఆచరించేవాడు. అదే సాధనగా భావించేవాడు. భార్యను చెప్పేవాడు 'నేను భోజనము చేయుటకు ముందు పొద్దున్న సాయంకాలము పక్కన చిన్న గ్లాసులో నీళ్ళు ఒక సూది పెట్టి పొమ్మ'ని చెప్పేవాడు. ఆ భార్య అట్లాగే చేస్తూ వుండేది. ఈ విధముగా కొన్ని సంవత్సరములు గడచి పోయాయి. ఆమె చూస్తూ వుండేది ఇతను ఏమి చేస్తాడో నని. కానీ అతను వాటిని ముట్టనేలేదు. ఒకనాడు సమయము పురస్కరించుకొని 'ఏమండి మీరు రోజూ సూది, నీరు పక్కన పెట్టమంటున్నారే, పెట్టినా వాటిని ఉపయోగించటం లేదే. ఏమిటి దీని అంతరార్థము అని అడిగింది. 'జగత్తంతయూ భగవత్ స్వరూపమే. మనం ఏదియు దుర్వినియోగం చేయకూడదు. అన్నం బ్రహ్మ కనుక అన్నమును వ్యర్థం చేయరాదు. అన్నము చేతనే మానవత్వము ఉద్భవిస్తున్నది, జీవిస్తున్నది, మేధాశక్తి పెరుగుతున్నది. అన్నము చేతనే అంత్యమవుతున్నది. కనుక సృష్టి స్థితి లయములకు మూలకారణము అన్నము. నేను భోజనము చేసేటప్పుడు ఒక్క మెతుకు క్రిందపడితే దానిని ఎంగిలి చేత్తో ఎత్తకుండా, సూదితో దానిని తీసి ప్రక్కనున్న నీటికప్పులో దానిని కడిగి మరి భుజించే దానికి ఇవన్నీ పెట్టమన్నాను. కాని ఒక్క మెతుకు కూడా క్రిందపడకుండా ముందే జాగ్రత్త పడినాను కాబట్టి వీటి అవసరము లేకపోయింది.

కాబట్టి మానవ జీవితములో ప్రధానమైనది మానవతా విలువలు. వాటిలో ప్రధానమైనవి నాలుగు. celing on desires. కోరికలపై అదుపు. (1) ఆహారము వ్యర్థము చేయవద్దు. don't

waste food. కాలము వ్యర్థము చేయవద్దు Do not waste time. డబ్బు వ్యర్థము చేయవద్దు. Don't waste money. misuse of money is evil. శక్తి వృథా చేయవద్దు. Don't waste energy.

ప్రేమ స్వరూపులారా! భగవంతుని నామము ప్రేమతో ఉచ్చరిస్తూ భగవంతుని ఆజ్ఞలను దేహముతో ఆచరిస్తూ, జీవితములో అనుభవిస్తూ లోకము లో దేవుని స్వరూపకముగా భావించినప్పుడు మనము తప్పక అనుగ్రహానికి గురౌతాము అనే విశ్వాసాన్ని బలపరచుకోవాలి. నామ చింతనే ప్రధానమనే అజ్ఞానములో మీరు పడుతున్నారు. నామముతో బాటు క్రియలో పాల్గొనాలి. ఆదే విభీషణునికి హనుమంతుడిచ్చిన సరియైన జవాబు. భగవత్ కార్యములో ఎన్ని అడ్డంకులు వచ్చినప్పటికి మనం లెక్క చేయకూడదు. రామాయణములో హనుమంతుడు దీనికెంత ఆదర్శమో యోచించవచ్చును. అతడు వానరుడు. మీరు నరులు. నరునకు వానరునకు వుండిన వ్యత్యాసము ఒక్కటి. ఆ ఒక్కటే 'వా' అనగా వాలము. తోక. వాలమున్నవాడు వానరుడు. వాలము లేని వాడు నరుడు. ఈనాడు నరుని కంటె వానరుడే మేలుగా వుంటున్నాడు.

ఆదర్శ వంతమైన జీవితాన్ని నిరూపించాడు హనుమంతుడు. హనుమంతుడు శాంతుడు. గుణవంతుడు. బలవంతుడు. రామకార్యము లోపల ఏర్పమూ మరచి పోయేవాడు. రోమరోమము రామనామము పలికేది. దేహమునే మరచి పోయేవాడు. అందువల్లనే అతనిని రాముడు అంత సన్నిహితముగా తీసుకున్నాడు. ఈనాడు రాం రాం రాం అని ఉచ్చరిస్తున్నా రామ కార్యములో ఏమాత్రము ప్రవేశించటం లేదు.

కనుక ఎవ్వరిని బాధించకుండా, ఎవ్వరికి కష్టములకు గురికానివ్వక, నీవు కూడా కష్టములకు గురికాకుండా సాధ్యమైనంత వరకు 'నొప్పించక, తానొవ్వక, తప్పించుక తిరుగువాడు ధన్యుడు' అను యుక్తిని యోగముగా భావించి జీవితమును సార్థకము చేసుకోవాలి.

1990 ఫిబ్రవరి 8వ తేదీ గురువారం త్రయీబృందావనంలో భగవాన్ బాబావారి దివయోపన్యాసం